


15న సాలూరులో జాబ్‌మేళా

పార్వతీపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న మినీ జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుకొని 18 నుంచి 25 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73825 59022, 94947 77553 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అంతా.. సిండికేట్



- పట్టణాల్లోని మద్యం దుకాణాలకు నామమాత్రంగా దరఖాస్తులు
- ఇతరులు దరఖాస్తు చేయకుండా అడ్డుకుంటున్న వ్యాపారులు
- తెరవెనుక కూటమి, వైసీపీ నాయకులు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. ముఖ్యంగా పట్టణా ల్లోని దుకాణాలను దక్కించుకునేందుకు పార్టీలకతీతంగా వారు ఏకమవుతున్నారు. ఇతరులు దరఖాస్తు చేయకుండా అడ్డుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తెర వెనుక అధికార పార్టీ నాయకులు, వైసీపీ నాయకులు ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. గురువారం నాటికి జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని 34వ నెంబర్ దుకాణానికి 19 దరఖాస్తులు, 35వ దుకాణానికి 18, 36వ షాప్‌కి 20, 37 నెంబర్ షాప్‌కి 17 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అదే విధంగా పార్వతీపురం మండలంలో 14వ నెంబర్ షాప్‌కి 17 దరఖాస్తులు, 15వ దుకాణానికి 16, 30వ షాప్‌కి 11, 31వ షాప్‌కి 11, 32వ షాప్‌కి 11, 33వ దుకాణానికి 14 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా సాలూరు సర్కిల్ పరిధిలోని 18వ నెంబర్ షాప్‌కి 35, 19 నెంబర్ దుకాణానికి 37, 20వ దుకాణానికి 36, 21వ షాప్‌కి 24, 22వ దుకాణానికి 25, 23వ షాప్‌కి 25, 39వ షాప్‌కి 21, 40వ షాప్‌కి 11, 41వ షాప్‌కి 12, 43వ షాప్‌కి 11, 44వ నెంబర్ దుకాణానికి 13 దరఖాస్తులు వచ్చాయి. పార్వతీపురం కంటే దారుణమైన పరిస్థితి సాలూరులో ఉంది. పార్వతీపురం సర్కిల్‌లో ఒకటి రెండు షాపులు మినహా ఏ దుకాణానికి కూడా 20 దరఖాస్తులు పడని పరిస్థితి ఉంది. దీనిబట్టి వ్యాపారులు ఏ విధంగా సిండికేట్ అవుతున్నారో అర్థమవుతుంది. కొంతమంది అధికార, ప్రతిపక్ష నాయకులు కలిసి దుకాణా లకు పెద్దగా దరఖాస్తులు రాకుండా తెరవెనుక ప్రయత్నాలు చేస్తూ సఫలీకృతులవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 52 మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటి వరకు 1,086 దరఖాస్తులు వచ్చాయి. నేడు (శుక్రవారం) ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో ఎన్ని దరఖాస్తులు వస్తాయో చూడాలి మరి.


గిరిజనులకే ప్రాధాన్యమిస్తాం..

- అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కిశోర్

షెడ్యూల్డ్ మండలాల్లో ఏర్పాటు చేసే మద్యం షాపుల్లో స్థానిక గిరిజనులకు ప్రాధాన్యత ఇస్తామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్ జీవన్‌కిశోర్ తెలిపారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన పాలసీలో భాగంగా షెడ్యూల్డ్ ఏరియాలోని మద్యం షాపులకు ప్రభు త్వం విధి విధానాలు, మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. షెడ్యూల్డ్ మండలాల్లోని మద్యం షాపులకు దరఖాస్తు చేసేందుకు స్థానిక గిరిజనులు మాత్రమే అర్హులని, ఒక వేళ వారు దరఖాస్తు చేయకపోతే స్థానికేతర గిరిజనులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కొన్ని గ్రామాలు షెడ్యూల్డ్ ఏరియా కింద నోటిఫై చేయబడి, మిగతా గ్రామాలు మైదాన ప్రాంతానికి చెంది ఉన్నట్టయితే ఆ మండలంలోని షాపు గిరిజనేతర వ్యక్తికి లాటరీలో కేటాయిస్తే, ఆ షాపును మైదాన ప్రాంతంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన గిరిజనులు స్థానిక ఎస్టీ సర్టిఫికెట్, ఎంట్రీ పాస్‌తో ఈ నెల 14న ఎంఎ నాయుడు కన్వెన్షన్ హాల్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు.

శక్తి స్వరూపిణీ
శరణు.. శరణు..

పాలకొండ/సాలూరు రూరల్: జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం పాలకొండలోని కోటదుర్గమ్మ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ మహిళలతో కుంకుమపూజలు నిర్వహించారు. అలాగే, సాలూరు పంచముఖేశ్వర ఆలయంలోని సంతోషిమాత అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఉంజల్‌సేవ, సంగీతార్చన, తెప్పోత్సవం నిర్వహించారు. శక్తి స్వరూపిణీ శరణు.. శరణు అంటూ భక్తులు వేడుకున్నారు.



సాలూరు రూరల్: దుర్గాదేవిగా దర్శనమిస్తున్న సంతోషిమాత



పాలకొండ: దుర్గాదేవి అవతారంలో కోటదుర్గమ్మ



సాలూరు కామాక్షి ఆలయం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- ఈ నెల 16న షెడ్యూల్ విడుదల
- జిల్లాలో 213 నీటి సంఘాలు
- ఓటర్ల జాబితా తయారీలో అధికారులు

(కొమరాడ)

వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్వీర్యమైన సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఈ మేరకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతుంది. ఈ నెల 16న మొదలై వచ్చే నెల 20వ తేదీలోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేపడుతుంది. సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించిన తరువాత జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవే కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. ఎలాగైనా ఈ ఎన్నికల్లో విజయం సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగనున్నాయి. 9 ఏళ్ల తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనుండడంతో గ్రామాల్లో సందడి మొదలైంది.



పెద్దగెడ్డ జలాశయం

తొమ్మిదేళ్ల తరువాత..

సాగునీటి కాలువల నిర్వహణ, చెరువుల ఆయకట్టుకు సక్రమంగా సాగునీటి సరఫరా వంటివి జల వనరులశాఖతో పాటు సాగునీటి సంఘాలు పర్యవేక్షించాలి. సాగునీటి వనరుల విషయంలో రైతులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి సంఘాలు కృషి చేస్తుంటాయి. అయితే, సాగునీటి సంఘాలకు చివరిసారిగా 2015లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో సాగునీటి సంఘాల చైర్మన్ల ఆధ్వర్యంలో పంట కాలువల్లో పూడికల తొలగింపు, నీరు చెట్టు పథకం కింద సాగునీటి చెరువుల అభివృద్ధి, ఆయకట్టు చివరి భూములకు సకాలంలో సాగునీరందించడం వంటి పనులు చేపట్టారు. కోతకు గురైన పంట కాలువల గట్లను సరిచేయించారు. సాగునీటి సంఘాల పదవీ కాలం ముగిసిన కొద్ది కాలానికి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన పాపాన పోలేదు. కాలువల్లో పూడికతీత, తుప్పల తొలగింపు, రెగ్యులేటర్ గేట్ల మరమ్మతులు వంటి పనులకు నిధులు విడుదల చేయాలని రైతులు ఎంత మొత్తుకున్నా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో సాగునీటి వనరులు అస్తవ్యస్తంగా మారాయి. ఈ నేప థ్యంలో దాదాపు 9 ఏళ్ల తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

213 సంఘాలకు ..

పార్వతీపురం మన్యం జిల్లాలో మేజర్, మైనర్, మీడి యం ఇరిగేషన్ కింద సుమారు 1.31 లక్షల ఎకరాలకు గాను 213 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మేజర్ ప్రాజెక్టుకు సంబంధించి ఒక కమిటీకి, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు నాలుగు, వాటర్ యూజర్ అసోసియేషన్ కమిటీలు 22, మీడియం ఇరిగేషన్‌కు సంబంధించి 25 సంఘాలకు, మైనర్ ఇరిగేషన్ కింద 106 చెరువులకు ఎన్నికలు జరిపేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనికోసం ఇప్పటికే ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నమయ్యారు.

40 రోజుల్లో ప్రక్రియ పూర్తి..

ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. మొదట సాగునీటి సంఘాలకు, ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ఆ తరువాత ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై జిల్లా నోడల్ అధికారి, జల వనరులశాఖ ఈఈ ఆర్.అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా.. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రెవెన్యూశాఖతో ఆయా సంఘాల పరిధిలో ఉన్న ఓటర్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

అపార్ ప్రయోజనం కల్పించేందుకు..

- త్వరలో ప్రభుత్వ విద్యార్థులకు అపార్ కార్డుల పంపిణీ
- మొదటి విడతగా 9, 10 తరగతుల వారికి..
- దసరా తరువాత మొదలుకానున్న ప్రక్రియ
- మార్గదర్శకాలు జారీ



(గరుగుబిల్లి)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డులను అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వీటిని వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ కార్డులు అని కూడా పిలుస్తారు. ఆధార్ కార్డుల మాదిరిగానే ఈ కార్డులు ఉంటాయి. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మొదటి విడతగా 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ కార్డులు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే యూడైస్ ప్లస్ పోర్టల్‌లో విద్యార్థుల సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. పోర్టల్‌లోని అంశాలు ఆధారంగా అపార్ కార్డులు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాలో 95వేల మంది విద్యార్థులు..

మన్యం జిల్లాలోని 1,586 ప్రభుత్వ పాఠశాలల్లో 95 వేలకు పైబడి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు 39,903 మంది, 6 నుంచి 10వ తరగతి వరకు 30 వేలకు పైబడి విద్యార్థులకు అపార్ కార్డులు అందించనున్నారు. జిల్లాలోని 15 మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ఈ నెల 14 నుంచి అపార్ కార్డుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 13 వరకు దసరా సెలవులు కావడంతో కొంతమేర ఆలస్యం నెలకొంది. సెలవులు ముగిసిన తదుపరి తల్లిదండ్రుల నుంచి సమ్మత పత్రాలు తీసుకొని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అపార్ కార్డులను అందించనున్నారు. అపార్‌పై తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. మొదటి విడతగా 9, 10 తరగతుల విద్యార్థులకు అందించి తరువాత దశలవారీగా మిగతా విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఎంతో ఉపయోగం..

ప్రస్తుతం ఆధార్‌కార్డు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆ విధంగానే అపార్ కార్డు కూడా విద్యార్థులకు ఎంతో కీలకం కానుంది. ఇందులో విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపర్చనున్నారు. 12 అంకెలతో కూడిన జీవిత కాల ఐడీ నెంబర్ ఇస్తారు. దీని ద్వారా విద్యార్థులు అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా పొందవచ్చును. విద్యార్థుల విద్యా ప్రమాణం, విజయాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు ట్రాక్ చేస్తుంది. అలాగే ఒక పాఠశాల నుంచి మరోక పాఠశాలకు బదిలీ అయ్యేందుకు ఉపయోగపడుతుంది.

తిప్పలు తప్పవా?

అపార్ కార్డులు జారీ చేసేందుకు ఉపాధ్యాయులు, ఎంఈవోలకు తిప్పలు తప్పేలా లేవు. ఆధార్ కార్డులోని వివరాల ఆధారంగా అపార్ కార్డులు మంజూరు చేయనున్నారు. అయితే, చాలామంది విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఇంటిపేర్లు, వారిపేర్లు తప్పుగా ఉన్నాయి. ఆధార్‌లో పూర్తిస్థాయిలో వివరాలు సక్రమంగా ఉంటేనే ప్రక్రియ ముందుకు సాగుతుంది. తప్పులను సవరించిన తదుపరే అపార్ కార్డులకు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. యూనిక్ ఐడీలను క్రియేట్ చేయడంతో పాటు తల్లిదండ్రులకు అపార్‌పై అవగాహన కల్పించాల్సి ఉంది.

నిర్ణీత సమయంలోగా పూర్తి..

ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు అపార్ కార్డులు అందించేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఇప్పటికే పలు మండలాలకు చెందిన ఎంఈవోలకు అవసరమైన ఆదేశాలు జారీ చేశాం. దసరా సెలవులు అనంత రం ప్రక్రియ వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు చేపడతాం. తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

-జి.పగడాలమ్మ, డీఈవో, పార్వతీపురం మన్యం జిల్లా

సాగునీటి సంఘాలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: మండలంలో సాగునీటి సంఘాలపై దృష్టి సారించాలని తహసీల్దార్ పి.బాల, ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మీకుమార్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ఈనెల 16న ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. మండలానికి సంబంధించి 13 చెరువుల పరిధిలో టీసీల ఎన్నిక జరగనుందన్నారు. గరుగుబిల్లి పరిధిలో దొర చెరువు, బీపీ పురం పరిధిలో రాములు చెరువు, ఉల్లిభద్ర పరిధిలో తామర చెరువు, చినగుడబ పరిధిలో కోనం చెరువు, ఉద్దవోలు పరిధిలో ముల్లనాయుడు చెరువు, వల్లరిగుడబ పరిధిలో కృష్ణ సాగరం, గరుగుబిల్లి తామర చెరువు, పెదగొడబ పరిధిలో గంగాసాగరం చెరువు, దళాయివలస పరిధిలో కొంకమమ్మ చెరువు, పెద్దూరు పరిధిలో ద్రాక్షాయని చెరువు, హిక్కింవలస పరిధిలో జగన్నాథ పట్నాయకుని చెరువులు ఉన్నాయన్నారు. సంబంధిత చెరువుల పరిధిలో సాగు చేస్తున్న రైతుల వివరాలను త్వరితగతిన అందించాలని వారు సూచించారు. సమాచారాన్ని అందించడంలో జాప్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న పడాల భూదేవి

పాలకొండ: టీడీపీ సభ్యత్వ నమోదుపై గురువారం శిక్షణ నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి టెక్నికల్ సిబ్బంది టెలీగ్రాం యాప్‌లో సభ్యత్వం ఎలా చేయాలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి వంద రూపాయలు చెల్లించాలన్నారు. రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందని చెప్పారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే ఐదు లక్షలు పరిహారం, సహజ మరణానికి రూ.30వేలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామంతుల దామోదరరావు, వారాడ సుమంత్‌నాయుడు, వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొరియా గ్రూపు గిరిజనులకు అటవీ పట్టాలివ్వాలి



ధర్నా చేస్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: కొరియా గ్రూపు గిరిజనులకు అటవీ హక్కుల పట్టాలివ్వాలని జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు సీదరపు అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కొరియా గ్రూపు గంజాయిభద్ర పంచాయతీలో సుమారు 50 మంది గిరిజనులకు పోడు పట్టాలివ్వలేదన్నారు. దీంతో వారికి అన్నదాత సుఖీభవ తదితర పథకాలు అందడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోతే పరిహారం దక్కడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు గెమ్మల జానకీరావు, సుందరరావు, జిత్తు, పూలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తుదారులకు సూచన

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎక్సైజ్ స్టేషన్‌లో నూతనంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. దీనిలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో రెండు షాపులకు స్థానికంగా ఉన్నవారు షెడ్యూల్ కులస్తులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా స్టేషన్‌లో కాకుండా కొంతమంది ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు, ఇతర కులస్తులు కూడా చేస్తున్నారని, వారు ఈ విషయాన్ని గమనించాలని, అదే విధం గా 14వ తేదీన జరిగే షాపుల ఎంపికకు వచ్చిన దరఖాస్తుదారులు తప్పనిసరిగా వారి కులధ్రువీకరణ పత్రం, స్థానిక ధ్రువప త్రాలను తీసుకురావాలని ఎక్సైజ్ సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ జి.రాజశేఖర్ తెలిపారు.

దరఖాస్తులతో రూ.5.60 కోట్లు

సాలూరు రూరల్: సాలూరు సర్కిల్‌లో 13 మద్యం షాపుల కోసం ఇప్పటికి రూ.5.60 కోట్లు దరఖాస్తు ఫీజు వచ్చిందని సాలూరు ఎక్సైజ్ సర్కిల్ సీఐ గులిపిల్లి దాసు చెప్పారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. సర్కిల్‌లో ఉన్న మక్కువ మండలంలో మూడు షాపులకు 108 దరఖాస్తులు వచ్చాయన్నారు. పాచిపెంట మండలంలో మూడు షాపుల కోసం 74, సాలూరు రూరల్‌లో రెండు షాపుల కోసం 39 దరఖాస్తులు, సాలూరు అర్బన్‌లో ఐదు షాపుల కోసం 59 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటి ద్వారా ఇప్పటికి రూ.5.60 కోట్లు దరఖాస్తు ఫీజు ఆదాయంగా లభించినట్టు ఆయన తెలిపారు.

కిటకిటలాడిన సంత



క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న సంత

పార్వతీపురంటౌన్: దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణంలో గురువారం జరిగిన సంత పశువుల, గొర్రెలు, మేకలు, కోళ్ల అమ్మకం, కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఉదయం 6 గంటల నుంచే ఏఎంసీ ప్రాంగణంలోకి జిల్లా కేంద్ర పరిసర మండలాల్లోని కాకుండా ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో గల గ్రామాల నుంచి కొనుగోలుదారులు ఎగబడ్డారు. ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది గా మారింది.

ధాన్యం కొనుగోలుపై నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవాలి

బలిజిపేట: మండల కేంద్రంలోని బలిజిపేట రైతు భరోసా కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ సహాయక సిబ్బందికి సాంకేతిక శిక్షణ సదస్సు నిర్వహించారు. తేమ శాతం 17 శాతం, సేంద్రియ వ్యర్థ పదార్థాలు ఒక శాతం, అసేంద్రియ వ్యర్థ పదార్థాలు ఒక శాతం, దెబ్బతిన్న, రంగుమారిన, మొలకెత్తిన, పురుగుబట్టిన ధాన్యం ఐదు శాతం, పరిపక్వంగాని, కుచించుకుపోయిన మెలితిరిగిన ధాన్యం మూడు శాతం ఉండేలా నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.దుర్గా అపూర్వ, పి.విద్యుశ శిక్షణ అందించారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,300, ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,320 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రావణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీలపై అవగాహనకు శిక్షణ

సీతానగరం: పంచాయతీల పరిపాలనపై అవగాహన పొందేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయయణ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలను ఆయన పరిశీలించి, పలు సూచనలు అందించారు. ఎంపీడీవో పి.త్రివిక్రమరావు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా 35 మంది ఉప సర్పంచ్‌లకు, 70 మంది వార్డు మెంబర్లకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ అందించామని చెప్పారు.

సూపర్ సిక్స్ అమలుచేయాలి

సీతంపేట రూరల్: కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.తిరుపతిరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ ప్రభుత్వం ధరలను నియంత్రించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం తప్ప ఇతర వస్తువులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా మంచి ప్రభుత్వం అని ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

దాహం.. దాహం..

- గ్రామాల్లో పని చేయని రక్షిత పథకాలు
- ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు
- అధికారులు స్పందించాలని విన్నపం



జిల్లాలోని పలు గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రక్షిత పథకాలు పని చేయకపోవడంతో కొళాయిల ద్వారా చుక్కనీరు రావడం లేదు. దీంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. అధికారులు స్పందించి తమ తాగునీటి కష్టాలు తీర్చాలని విన్నవిస్తున్నారు.

వారం రోజులుగా ఇక్కట్లు



సచివాలయం ముందు నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస పంచాయతీ ప్రజలు ఒక్కసారి భగ్గుమన్నారు. గత వారం రోజులుగా తాగునీరు కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్న వీరు ఏకంగా సచివాలయానికి వెళ్లి సర్పంచ్ ఈదల రాములు, ఎంపీటీసీ సభ్యుడు దత్తి శంకరరావు, పంచాయతీ కార్యదర్శి కె.సరళకుమారిలను నిలదీశారు. నీటి కోసం ఇంత ఇబ్బందులు పడుతున్నా అసలు ఎందుకు పట్టించుకోరని మండిపడ్డారు. వాస్తవానికి గ్రామంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో రెండు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మినీ రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, ఎస్సీ వీధిలో, హాస్పిటల్ కాలనీలో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు మినీ రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు ఉన్నాయి. కానీ అవి తాగునీటికి పనికి రావని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న 90వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామానికి అందుతున్న నీరే ప్రధాన తాగునీటి వనరు. కానీ గత ఐదు రోజులుగా తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్న వీరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత దారుణంగా తాగునీటి పరిస్థితి ఉన్నా ఎందుకు పట్టించుకోరని నిలదీయడంతో రెండు రోజుల్లో సరిచేస్తామని, బొమ్మిక నుంచి బూస్టర్ పంపు హౌస్ నుంచి వచ్చిన మార్గంలో చాలా చోట్ల లీకులకు గురై తాగునీరంతా వృథాగా పోతున్నదని పంచాయతీ కార్యదర్శి సరళకుమారి ప్రజలకు చెప్పి దానివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, పూర్తిగా సరిచేస్తామని హామీ ఇచ్చారు. కొంత శాంతించిన ప్రజలు రెండు రోజుల్లో తాగునీరు ఇవ్వకపోతే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించి వెళ్లిపోయారు.

రెండు రోజుల్లో సరిచేస్తాం

జియ్యమ్మవలసలో తాగునీటికి ఇబ్బంది ఉండటం వాస్తవమే. అయితే దీని కోసం ప్రభుత్వం జల జీవన్ మిషన్ కింద రూ.33లక్షలు మంజూరైతే కొంత పనిచేశాం. రెండోసారి మళ్లీ అదే స్కీంలో మరో రూ.22లక్షలు మంజూరైంది. దీంతో పనులు చేసి తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

- భరత్‌చంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, జియ్యమ్మవలస

గంటలకొద్దీ కొళాయిల వద్ద నిరీక్షణ



తాగునీటి కోసం కొళాయిల వద్ద ఉన్న మహిళలు(ఫైల్)

వీరఘట్టం: మేజర్ పంచాయతీ వీరఘట్టం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలోని తాగునీరు అందించడానికి ఒట్టిగెడ్డలో ఫిల్టర్ బావి ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి పంచాయతీ కార్యాలయం వెనుక వాటర్‌ట్యాంక్‌కు నీరు సరఫరా చేసి, అక్కడి నుంచి గ్రామంలోని ఇళ్లకు పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. అయితే సక్రమంగా నీరు అందకపోవడంతో దిగువ వీధిలో ఉన్న కస్పావీధి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఇళ్లకు సరిపడా తాగునీరు అందక మహిళలు గంటల కొద్దీ కొళాయిల వద్ద వేచిచూస్తున్నారు. బుధవారం కూడా గ్రామంలోని కొళాయిల వద్ద మహిళలు అధిక సంఖ్యలో వేచి చూడడం కనిపించింది. వరుసలో బిందెల ఉంచి నీరు పడుతున్నామని, అయితే ఒక్కసారి సగం మంది వరకే నీరు అందుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ప్రాంతానికి తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.

కొత్త పైపులైన్‌కు ప్రతిపాదనలు

ఇదే విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వినీ ప్రవల్లిక వద్ద ప్రస్తావించగా దిగువవీధి ప్రాంతానికి తాగునీరు అందించేందుకు కొత్త పైపులైన్ వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు.

తాగునీటి పథకాన్ని బాగుచేయరూ..

సీతంపేట రూరల్: మండ గ్రామంలోని మినీ రక్షిత తాగునీటి పథకాన్ని బాగు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని ఆ గ్రామ గిరిజనులు కోరారు. గత నెల రోజులుగా ఈ పథకం మొరాయించిందని, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన సవర సూర్యం, నాగార్జున, వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు బుధవారం డిమాండ్ చేశారు.



వినియోగంలో లేని మినీ రక్షిత పథకం

రెండు రోజుల్లో బాగు చేయిస్తాం

ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాపారావు దృష్టికి తీసుకువెళ్లగా, రక్షిత తాగునీటి పథకాన్ని రెండు రోజుల్లో బాగుచేయించి, వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికే ప్రాధాన్యం

బెలగాం: పోలీస్ సిబ్బంది సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన, రిటైర్డ్, హోంగార్డు కుటుంబాలతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. పదవీ విరమణ చేసిన, చనిపోయిన కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి రావలిసిన బెనిఫిట్స్ సకాలంలో అందిస్తామని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ

హైరిస్క్ సమస్యలను గుర్తించాలి



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

వీరఘట్టం: గర్భిణుల్లో హైరిస్క్ ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు బిటివాడ పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షలను పరిశీలించి మాతా శిశు సంక్షేమ కార్డులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు వివరాలు నమోదు పూర్తి చేయాలన్నారు. ల్యాబ్‌లో గర్భిణులకు చేపట్టిన హీమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించగా రక్తహీనతగా గుర్తించిన వారికి పీహెచ్‌సీ వార్డుల్లో ఇంజక్షన్లను వైద్య సిబ్బంది ఇస్తున్న తీరును పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మానస, నితీషా, డెమో యోగేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, ఇందిరాదేవి, లలితకుమారి, చినబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి పూజల్లో ఎమ్మెల్యే



ఘటం ఎత్తుకున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలు సందర్భంగా మాతలమ్మ తల్లికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం నుంచి ప్రారంభమైన గిరిజన దేవత ఘటాన్ని తలపై పెట్టి మోశారు. ఆలయం వరకు ఘటాన్ని 20 కిలోమీటర్లు ఒకరు తర్వాత ఒకరు మోస్తూ వెళతారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకరరావు, బగ్గం బాబ్జీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ ఎమ్మెల్యేను కలిసిన జగదీశ్వరి

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం రాయగడ మజ్జి గౌరమ్మతల్లిని దర్శనం చేసుకున్నారు. అనంతరం రాయగడ ఎమ్మెల్యే కాద్రక అప్పలస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరు జంజావతి సమస్య సరిహద్దు రహదారులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుతీరు తదితర అంశాలపై చర్చించారు. కురుపాం ఎమ్మెల్యే వెంట లక్ష్మణరావు, లోవరాజు తదితరులున్నారు.

స్వచ్ఛమైన స్నేహం.. ఉన్నతికి మార్గం



చిన్ననాటి స్నేహితులతో కలిసిన ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: జీవితంలో స్వచ్ఛమైన స్నేహం దొరికిన వ్యక్తి ఉన్నతికి రాచబాట వేస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక సాయిస్ ప్యాలెస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ తనతో కలిసి చదువుకున్న స్నేహితులంతా ఒక చోటకు చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నామన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ పెట్టండి

పార్వతీపురంటౌన్: దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రతిఒక్క సచివాలయ అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ కె.పకీరురాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని 15 సచివాలయాలకు సంబంధించి ప్రజారోగ్య పర్యవేక్షణ అధికారులతో సమావేశం నిర్వహించారు. పండుగ సమయాల్లో పారిశుధ్య నిర్వహణపై సచివాలయ అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన డీఎస్పీ

పాలకొండ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుషారావును పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. పాలకొండ మీదుగా వంగర మండలం రుషింగి వెళుతున్న న్యాయమూర్తిని డీఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం, మొక్కను అందించారు. ఆయన వెంట సీఐ చంద్రమౌళి ఉన్నారు.



న్యాయమూర్తికి మొక్కను అందిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలి

బెలగాం: ప్రతిఒక్కరూ విధిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి సుకుమార్ బాబు తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుప త్రిలో వైద్యుడు నగేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సంద ర్భంగా ప్రత్యేక నేత్ర పరీక్షలు నిర్వహించారు. దృష్టి దోషం ఉన్న వారికి కళ్లజోళ్లు అందించి, కేటరాక్ట్ ఉన్నవారికి మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు పంపించినట్టు నగేష్ తెలిపారు. నేత్ర వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తపై సుకుమార్ బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో, నేత్ర నిపుణులు శ్యామల, వెంకటేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

కొమరాడ: అసాంఘిక కార్యక్రమాల పట్ల ప్రజలు దూరంగా ఉండాలని కొమరాడ ఎస్ఐ నీలకంఠం అన్నారు. గురువారం బెడ్డ గ్రామంలో గిరిజనులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాలూరు సీఐకి సన్మానం

సాలూరు రూరల్: సాలూరు సీఐ బి.అప్పలనాయుడుకు స్థానిక పెదయాత వీధికి చెందిన మరిడిమాంబ యూత్ గురువారం ఘనంగా సన్మా నించారు. సాలూరులో ఈనెల 3 వరకు జరిగిన గణనాథుని ఉత్సవాల నిమజ్జనోత్సవాలను సజావుగా జరిగిపించినందుకు ఆయన సేవలను కొనియాడారు. ఏఎస్ఐ వలీ, పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

సీతంపేట రూరల్: స్కిల్ కాలేజ్ నేషనల్ లెవెల్ మ్యానిటరింగ్ బృందం సీతంపేట వైటీసీని గురువారం సందర్శించింది. పిల్లలతో పాటు భోజనం చేశా రు. శిక్షణ, వసతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధు లు సశ్యపాన్, సలీమ్‌కుమార్, జేడీఎం రమణమూర్తి, ఉపాధి హామీ ఏపీడీ శ్రీహరి, వెంకటరమణ, వైటీసీ మేనేజర్, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా దాసరి ఉషారత్నకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జి.సిగడాం కేజీబీవీలో పనిచేసిన ఆమె బదిలీపై రేగులపాడు కేజీబీవీకి వచ్చారు.

దుర్గమ్మగా పోలమాంబ



మక్కువ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శంబర పోలమాంబ అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రేపటి నుంచి తోటపల్లిలో పవిత్రోత్సవాలు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి దేవస్థానాల్లో ఈనెల 12 నుంచి పవిత్రోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆశ్వీయాజ శుద్ధ దశమిని పురస్కరించుకుని ఈనెల 12 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, 15న నాగావళి నదీ తీరంలో శ్రీచక్ర తీర్థ స్నానం ఉంటుందని చెప్పారు.

ముగిసిన శిక్షణ

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో ఉన్న హైస్కూల్‌లో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై ఇస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. పంచాయతీ పరిపాలన విధానం, ఘన - ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రామీణ తాగునీరు తదితర వాటిపై కార్యదర్శులు బి.రామకృష్ణ, సతీష్, అజయ్, లోకేష్ వివరించారు. కోర్స్ డైరెక్టర్‌గా మం డల ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రామారావు వ్యవహరించారు.

ఏనుగుల సంచారం

సీతానగరం: మండలంలోని తాన్న సీతారాంపురం, గుచ్చిమి గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు వదలనంటున్నాయి. గురువారం ఆయా గ్రామాల నీలగిరి తోటలు, కొండల సమీపంలో సంచరించాయి. వరి పొలాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగా తిరగవద్దని ఫారెస్టు అధికారులు తెలిపారు. ప్రత్యేక పర్యవేక్షణ అధికారి మణికేంఠేష్ నేతృత్వంలో పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

కొత్తపేటలో హోమం

విజయనగరం రూరల్: దుర్గానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేట, యాదవవీధి, బంగారమ్మ చదును వద్ద గురువారం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేకంగా హోమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ హోమం 12.30 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది. సాయంత్రం కొత్తపేటకు చెందిన నాట్య కళాకారుడు టీకే సత్యనారాయణ, ఆయన శిష్య బృందంచే కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య కార్యక్రమం వైభవంగా జరిగింది. శుక్రవారం దుర్గాదేవికి ఇష్టమైన లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

అందరి సహకారం అవసరం

రింగ్‌రోడ్డు: అందరి సహాయసహకారాలతో విజయనగర ఉత్సవాలను విజయవంతం చేద్దామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు.గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 9అంశాలపై ఆజెండా రూపొందించగా 5అంశాలను స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో చేపట్టే ప్రతిపనికి మేయర్ అనుమతి తప్పనిసరి అన్నారు. మేయర్ మట్లాడుతూ ఈనెల 14,15,16 తేదిల్లో జిల్లా యంత్రాంగం నిర్వహిస్తున్న పైడితల్లమ్మ జాతర, విజయనగరం ఉత్సవాలకు అందరి సహకారం ఎంతో అవసరం అన్నారు. కమిషనర్ నల్లనయ్య, సహాయకమిషనర్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య జీవీ రంగారావు, రేగాన రూపాదేవి, అధికారులు ఉన్నారు.

14న కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు

కలెక్టరేట్: జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పైడితల్లిమ్మ పండగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు డీఆర్‌వో అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు దీనిని గమనించాలని కోరారు.

గాంధీనగర్‌లో అన్నదానం

రాజాం: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాంధీనగర్ కాలనీలో గురువారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రోగికి ఆర్థిక సాయం

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన పలగర సరస్వతి గత కొద్ది నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతుంది. గురువారం ఆమెకు మందులు కొనుగోలు నిమిత్తం స్థానిక అన్నపూర్ణ ఆపన్న హస్తం నిర్వాహకులు, తూర్పు భాగవత కళాకారులు, సామాజిక కార్యకర్త అయిన, బొంతలకోటి లక్ష్మి శంకరరావు గురువారం రూ.5,000 అందజేసి దాతృత్వం చాటుకున్నారు. అలాగే గత మూడు నెలలుగా సరస్వతికి మందులు కొనుగోలు నిమిత్తం దాతల సహాయంతో రూ.11,000 అందజేశామని శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు స్పందించి ఆమెను ఆదుకోవాలని కోరారు.

వేపాడ: వేపాడ గ్రామానికి చెందిన కొలుపూరి రమణ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన జైభీమ్ యూత్ సభ్యులు తలో వెయ్యి రూపాయలు పోగు చేసి మొత్తం రూ.8000లను బాధితుడు కొలుపూరి రమణకు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ట్రస్టు సభ్యులు దెబారిక కిరణ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి తీరని లోటు

రాజాం: దేశ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యాపారవేత్త, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనమైన రతన్ టాటా మృతి దేశ పారిశ్రామిక రంగానికి తీరని లోటని మాజీ మంత్రి టీడీపీ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో దేశం సంకట స్థితిలో ఉన్నపుడు అన్నీ మరిచి ఆపన్న హస్తాన్ని అందించిన దేవుడు రతన్ టాటా అని అన్నారు.

రామలింగేశ్వరాలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రామభద్రపురం: మండల కేంద్రంలో ఉన్న గిరిజా రామలింగేశ్వరాలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హోమం నిర్వహించారు. ఆలయ పూజారి బాదంపూడి నాగరామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. భవానీలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కొట్టక్కి విద్యార్థిని

రామభద్రపురం: జాతీయస్థాయిలో జరిగే పోటీలకు మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రొంగళి మౌనిక ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బొత్స రత్నకిశోర్ తెలిపారు. ఇటీవల జరిగిన అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలిక పాల్గొని మంచి ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి జట్టులో చోటు కల్పించారు. నవంబర్‌లో గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున బాలిక పాల్గొంటుంది. బాలిక తండ్రి రొంగళి తిరుపతిరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వెనుకబడిన ప్రాంతానికి చెందిన బాలిక సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రత్యేక ప్రతిభ కనబరచడంపై పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.కృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనూరాధ, గ్రామ పెద్దలు మౌనికకు అభినందనలు తెలిపారు.

గిరిజన చిన్నారులకు బ్యాగుల పంపిణీ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి శివారున గల గిరిజన గ్రామం రామన్నవలసలో గురువారం బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘం కార్యదర్శి గోవిందనాయుడు పర్యవేక్షణలో గిరిజన చిన్నారులకు దుస్తులు, స్కూల్ బ్యాగ్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వనమిత్ర కృష్ణదాస్ మాట్లాడారు. గ్రామస్థులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి సబ్ డివిజన్‌లో గల బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల రైతు సేవ కేంద్ర సిబ్బందికి రైతు సేవ కేంద్రం విజయనగరం ఆధ్వర్యంలో గురువారం బొబ్బిలిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కర్యక్రమంలో రైతు సేవ కేంద్రాల నిర్వహణ, పంటల నమోదు, ఈ-కేవైసి, ఖరీఫ్ సీజన్‌లో పంటల సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, వరి పంట కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

ఎంతటి నిర్లక్ష్యం!

- మూలకు చేరిన విలువైన పరికరాలు
- పట్టించుకోని అధికారులు
- వంగర ప్రభుత్వ కార్యాలయాల్లో దుస్థితి

వంగర: బాధ్యతాయుత విధుల నిర్వహణ, ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా లక్షలు వెచ్చిస్తున్నాయి. ఆ సంకల్పంతోనే ప్రభుత్వ కార్యాలయాల్లో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చాయి. అవసరమైన సామగ్రిని వివిధ రూపాల్లో కొనుగోలు చేసి కార్యాలయ ఉన్నతాధికారులు సరఫరా చేస్తున్నాయి. అలాంటి విలువైన పరికరాలు సద్వినియోగం, భద్రతలో స్థానిక అధికారులు నిర్లక్షంతో మూలన చేరుతున్నాయి. చిన్నపాటి మర్మతులు కూడా చేయించకపోవటంతో విలువైన యంత్రాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.



మూలకు చేరిన జనరేటర్



తుప్పల్లో పడి ఉన్న బోటు

● ఆరు బయట జనరేటర్

మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంకు మంజూరైన జనరేటర్ అలనాపాలనా లేక మూలన చేరింది. కంప్యూటర్ పనుల్లో జాప్యం నిరోదించటానికి నాలుగేళ్ల క్రితం మంజూరైన జనరేటర్‌కు ప్రభుత్వం రూ.5 లక్షలు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ స్కాన్ పథకంలో కలెక్టర్ కార్యాలయానికి అనుసందానం చేసేందుకు ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ యంత్రం వచ్చిన వారానికే మూలకుచేరింది. విద్యుత్ అంత రాయానికి ప్రత్యమ్నాయంగా ఉండాల్సిన పరికరం మూడనాళ్ల ముచ్చటిగా మారింది.

● సేవలు అందించని బోట్లు

వరదల సమయంలో అత్యవసర సేవలు అందించటానికి ప్రభుత్వం మరబోట్లు మంజూరు చేసింది. ఈ బోట్లు వరదలు వచ్చినపుడు నాగావళి, మడ్డువలస రిజర్వాయర్‌లో వినియోగించాలని ప్రభుత్వం 10 సంవత్సరాల క్రితం రెండు బోట్లు మంజూరు చేసింది. ఒకటి మడ్డువలస విశ్రాంత గృహం వద్ద ప్రాంగణంలో కొందరు ఆకతాయిలు తగలపెట్టగా, మరోకటి తహసీల్దార్ కార్యాలయంలో ఇలా మూలన పడింది. వీటి కొనుగోలుకు అప్పట్లో ప్రభుత్వం ఒక్కొక్క బోటుకు రూ.5 లక్షలు వెచ్చించింది. బోటుల్లో విలువైన సామాగ్రిని దొంగలు పట్టుకుపోయారు.

● దృష్టి పెడతాం

ఇటీవలే నేను విధుల్లో చేరాను. జనరేటర్, బోట్ల సంగతి ఇంకా తెలిదు. వీటిపై దృష్టిపెడతాం. సిబ్బందిని పంపి దర్యాప్తు చేయిస్తా. జనరేటర్ పూర్తిగా పాడైయింది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తా. బోటును కూడా పరిశీలిస్తాం.

-ధర్మారావు, తహసీల్దార్, వంగర

నీటి తీరువా వసూలు చేయండి

● బకాయిలు రూ.14 కోట్లు ● కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, అక్టోబరు 10: జిల్లాలో నీటి తీరువా బకాయిలు సుమారు రూ.14 కోట్లు ఉందని, నెలాఖరులోగా పూర్తిగా వసూలు చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాలు, సాగునీటి సంఘాల ఎన్నికలు, నీటి తీరువా వసూళ్ల తదితర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పక్కాగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన 13 మంది తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రేషన్ డీలర్లు, రేషనలైజేషన్, ఖాళీల భర్తీ ప్రక్రియలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయా లన్నారు. జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ తహసీల్దార్లు జాబ్ చార్ట్‌ను విధిగా పాటించాలని సూచించారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండివారంతా ఓటు హక్కు పొందేలా ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఇసుక కొరత లేకుండా ఈనెల 15 నుంచి కొత్తగా రెండు రీచ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గీఆర్‌వో అనిత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

శాసనపల్లిలో జేసీ పర్యటన

● ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



శాసనపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

జామి: ఏటా కురిసే వర్షాలకు గెడ్డలు పొంగి బయట గ్రామాలతో రాకపోకలు నిలిచిపోయి తీవ్ర అవస్థలు పడుతున్నామని నాలుగురోజుల క్రితం శాసనపల్లి యువత తమ కష్టాలపై ప్రత్యేకంగా వీడియో చేసి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎక్స్‌లో పోస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఉపముఖ్యమంత్రి కుడా 'మీ సమస్య పరిష్కరిస్తా.. సమయం ఇవ్వండి' అని ఎక్స్‌లో సమాధానం ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి సూచనతో జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ ఈ గ్రామంలో సమస్యపై నివేదిక ఇవ్వాలని జేసీ సేతుమాదవన్‌ను ఆదేశించారు. దీంతో గురువారం సాయంత్రం జేసీ శాసనపల్లి వచ్చారు. అనంతరం పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్‌తో కలిసి ముంపునకు గురవుతున్న స్థలం పరిశీలన చేసి వంతెన నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మట్లాడుతూ ఇది 110 మీటర్ల దూరం ఉందని, సుమారు నాలుగున్నర కోట్లు అవసరం ఉండొచ్చని, తాత్కాలికంగా అక్కడ ఉన్న పరిస్థితులు చూసి వివరించారు. అనంతరం గ్రామయువత, పెద్దలు తమ సమస్యను పూర్తిస్థాయిలో వివరించి తమ కష్టాలు తీర్చాలని కోరారు. దీనిపై జేసీ స్పందిస్తు ఈ విషయాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో ఇస్తామని తెలిపారు. తహసీల్దార్ కృష్ణలత, పీఆర్‌డీఈ సీహెచ్‌వీఎన్ నాయుడు, ఎంపీడీవో నీలంనా యుడు, సర్పంచ్ వెంకట అప్పారావు, పెద్దలు ఆకిరి వెంకటరావు, సాదనాల రాంబా బు, గుల్లిపల్లి శ్రీను, చప్ప కృష్ణ, టీడీపీ జిల్లా కార్యదర్శి కొత్తలి సూర్యారావు తదితరులున్నారు.

నేడు బొబ్బిలి కోటలో ఆయుధ పూజ

బొబ్బిలి: బొబ్బిలి కోటలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా విజయదశమి ముందురోజైన శుక్రవారం అయుధ పూజ నిర్వహించనున్నారు. బొబ్బిలి రాజ వంశీయుల ఆద్వర్యంలో ఘనంగా జరిగే ఈ కార్యక్రమానికి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజుల కోట వైపు తొంగి చూసేందుకు అధికార యంత్రాంగం సంకోచించేది. కోటలోకి వెళ్లి ఆయుధ పూజను తిలకించినట్లు అప్పటి ప్రభుత్వ పెద్దల దృష్టిలో పడితే ఇక్కట్లకు గురికావాల్సి వస్తుందని భయపడేవారు. ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా రాజవంశీయులైన బేబీనాయన ఎన్నిక కావడంతో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు నిస్సంకోచంగా బొబ్బిలి కోటకు వచ్చి రాజులు నిర్వహించే ఆయుధపూజను తిలకించేందుకు ఆసక్తి చూపుతుండడం గమనార్హం.

రక్షిత నీటి సరఫరా సక్రమంగా లేదు

● గ్రామదర్శినిలో మునకలవలస ప్రజల ఫిర్యాదు



మునకలవలసలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

రేగిడి: తమ గ్రామానికి రక్షితనీటి సరఫరా సక్రమంగా లేదంటూ మండలంలో మునకలవలస గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం మునకలవలస గ్రామంలో అధికారులు బృందం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామంలో అంగన్‌వాడీ, రేషన్‌డిపోలను తనిఖీచేసి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు మంచినీటి సమస్యను, సాగునీటి సమస్యలు ప్రస్తావించారు. వాటర్ సమస్య పరిష్కారానికి సంప్ మంజూరైనట్లు, ఇది నిర్మాణం పూర్తియితే ఇంకా సమస్య ఉండదని, సాగునీటి సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని నచ్చజెప్పారు. వివిధ శాఖాల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రాజాం: అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను, ఆటపాటలను చిన్న వయస్సులోనే నేర్పించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. గురువారం బొమ్మినాయుడువలసలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను, రేషన్ డిపోను, వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎస్సీ కాలనీలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు రావడంలేదని కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

విద్యార్థులకు యూనిఫారాల పంపిణీ



యూనిఫారాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

వేపాడ: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్ సాధించాలని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆకాంక్షించారు. గురువారం మండలంలోని అరిగిపాలెం గ్రామంలో ఆర్కే విద్యా సంస్థలు సమకూర్చిన యూనీ ఫామ్స్‌ను విద్యార్థులకు పంపిణి చేసారు. అనంతరం విద్యార్థులు, గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి గొంప కృష్ణ, మాజీ ఎంపీటీసి పడాల వెంకటరమణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, దములూరి గోవింద, నాగిరెడ్డి ముత్యాలునాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఏసీపీ బాధ్యతల స్వీకరణ



ఏసీపీ రమణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా విజయనగరం నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా రమణమూర్తి బదిలీపై వచ్చారు. గురువారం బాధ్యతలు చేపట్టిన రమణమూర్తిని ఎల్‌టీపీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదినారాయణ, అల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసరావుతో పాటు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీపీవో ఎన్ అప్పలరాముకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక సంస్థలో ఎల్‌టీపీ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

సీబీఎం బాలికల హైస్కూల్ కోసం సంతకాల సేకరణ



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

బొబ్బిలి: సీబీఎం బాలికల హైస్కూలు మనుగడకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ముందు సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. సీపీఐ, ఎంఆర్‌పీఎస్ తదితర సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ విభాగం జిల్లా నాయకుడు బొద్దాన అప్పారావు మాట్లాడుతూ సీబీఎం పాఠశాలకు వందేళ్లకు పైగా చరిత్ర ఉండడమే కాక, ఇక్కడ చదువుకున్న వారు దేశవిదేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. అలాంటి మిషనరీ స్కూలును కర స్పాండెంట్ అడ్డగోలుగా అమ్మేయడం చట్టవిరుద్ధమన్నారు. పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు దీనిని భూ బదలాయింపు పేరుతో కొనుగోలుచేయడమే కాక దబాయింపు చేయడం అర్థరహితమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు మునకాల శ్రీనివాస్, కాగాన సునీల్‌కుమార్, కోట అప్పన్న, లక్ష్మునాయుడు, పి.శంకరరావు, గొంటి వేణు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి విజయకల్యాణి

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.విజయకల్యాణి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పొరేషన్ పరిధిలోని ఆనంద భారతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ కార్యదర్శి విజయకల్యాణి మాట్లాడుతూ మానసిక రోగులపట్ల వివక్ష తగదని, వారికి అందరితో పాటే సమానంగా న్యాయపరమైన హక్కులు కలిగి ఉంటారని వివరించారు. భవిత కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సదరం ధ్రువపత్రాలు ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** బొబ్బిలిలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమావేశ మందిరంలో గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ శశిభూషణరావు ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ న్యాయాధికారి అరుణశ్రీ పాల్గొని మాట్లాడారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే కొంతవరకైనా వారి సమయంలో 30 నిమిషాలు ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. ధ్యానం చేయడం ద్వారా మనసు ప్రశాంతంగా మారడమే కాకుండా ఆరోజంతా మనిషి ఉత్సాహంగా ఉంటాడన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి విజయకల్యాణి



బొబ్బిలిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి అరుణశ్రీ

మినీ వ్యాన్ బోల్తా.. ఒకరి మృతి

సీతంపేట రూరల్: మండలంలోని కోతాం గ్రామ సమీపంలో గురువారం ఉదయం మినీ వ్యాన్ బోల్తా పడిన ఘటనలో కొత్తపల్లి సతీష్ (33) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం జిల్లా ఒడిసాలూరు గ్రామం నుంచి బీఎస్ఎన్ఎల్ టవర్ సామాన్లను మినీ వ్యాన్‌లో వేసుకుని కె.సతీష్, శ్రీను, లోవరాజులు కోతాం గ్రామం వైపు ప్రయాణిస్తున్నారు. బొమ్మిక నుంచి కోతాం గ్రామ మధ్యలోకి వచ్చేసరికి మినీ వ్యాన్ ఎత్తయిన ఘాట్ రోడ్డు పైకి ఎక్కలేక పక్కనే ఉన్న లోయలోకి ఒరిగింది. ఇది గమనించిన డ్రైవర్ లవ్‌రాజు, శ్రీను వ్యాన్ నుంచి పక్కకు గెంతేసి చిన్న గాయాలతో బయటపడ్డారు. వ్యాన్‌లో ఉన్న కొత్తపల్లి సతీష్ వ్యాన్ నుంచి బయట పడలేక లోయలోకి దూసుకుపోయిన మినీ వ్యాన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య

కురుపాం: తల్లిదండ్రులు మందలించారని ఎం.పూర్ణిమ(17) అనే బాలిక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు కురుపాం ఎస్ఐ నాయణరావు తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక శివ్వలవీధికి చెందిన గోవిందరావు కుమార్తె పూర్ణిమ. పార్వతీపురంలోని ఓ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. తల్లిదండ్రులు మందలించారని కోపంతో సెప్టెంబరు 20వ తేదీన గడ్డిమందు తాగింది. వెంటనే పూర్ణిమకు పార్వతీపురం ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం గురువారం సాయంత్రం కురుపాం తీసుకువచ్చారు. దీంతో శివ్వలవీధిలో విషాదం నెలకొన్నది.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

గుర్ల: గంజాయి తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘువులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని ఎస్ఎస్ఆర్.పేట గ్రామం చంపావతి నది పరివాహక ప్రాంతంలో గంజాయి విక్రయి స్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ నారాయణరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, 5 సెల్‌ఫోన్లు, రూ.1,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందినవారు కాగా, మిగతా ఐదుగురు విజయనగరం జిల్లాకు చెందినవారు. ఈ కేసు పరిశీలనకు పనిచేసిన చీపురుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావు, స్థానిక ఎస్ఐ నారాయణరావుతోపాటు ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు



నిందితులను విలేఖర్ల ముందు హాజరుపరిచిన పోలీసులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట, నాయుడువలస, కొట్టక్కి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించి అందులో ఉన్న కాపర్‌వైర్‌ను అపహరించుకుపోయిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో దీనికి సంబంధించి వివరాలను బొబ్బిలి డీఎస్పీ పొడిపిరెడ్డి శ్రీనివాసరావు ఈ విధంగా తెలిపారు. ఆరికతోట గ్రామంలో ఈ ఏడాది 9వ నెలలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగినట్టు గ్రామ సర్పంచ్ పెంకి పుష్పమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదైంది. గతేడాది నాయుడువలస, కొట్టక్కి గ్రామాల్లో కూడా ఇటువంటిదొంగతనాలు జరగడంతో వీటిపై కూడా కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో గురువారం ఆరికతోట గ్రామం వద్ద కొందరు అనుమానాస్పదంగా తిరగడంతో అదుపులోకి తీసుకొని విచారించగా ఈ దొంగతనం బయట పడిందని తెలిపారు. విజయనగరం కంటోన్మెంట్ దగ్గర నివాసం ఉంటున్న జున్నీ రాంసింగ్, హరదీప్‌సింగ్‌లను అరెస్టు చేశామని, పంజాబ్ రాష్ట్రానికి చెందిన వీరు గత కొన్నేళ్లుగా విజయనగరంలోనే నివాసం ఉంటున్నారని తెలిపారు. జిల్లాలో వీరిపై 14 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. గజపతినగరం పోలీసు స్టేషన్‌లో 4 కేసులు, నెలిమర్లలో 2, పూసపాటిరేగలో 1, ఎస్.కోటలో 1, డెంకాడ 1, విశాఖపట్టణం సిటీ లిమిట్స్‌లో పద్మనాభం, ఆనందపురంలో ఈ తరహా కేసులు నమోదయ్యాయన్నారు. సుమారు 70 కిలోల కాపర్‌వైరు, నేరానికి ఉపయోగపడే వస్తువులను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. విజయనగరానికి చెందిన జున్నీ రామ్‌సింగ్‌పై హత్య కేసుతోపాటు రౌడీషీట్ కూడా ఓపెన్ చేశామని తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయ ణరావు, ఎస్ఐ వెలమల ప్రసాద్, ఏఎస్ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. నిందితులు వినియోగిస్తున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీసులకు రివార్డు ఇస్తామని డీఎస్పీ తెలిపారు.

నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ మూర్తి

శృంగవరపుకోట: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని శృంగవరపుకోట పోలీస్‌లు అరెస్టు చేశారు. సీఐ వీఎన్ మూర్తి అందించిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ నెలలో 200 కేజీల గంజాయితో బొలెరో వాహనం పట్టుబడింది. ఈ ఘటనలో నిందితుడు ఒడిసా రాష్ట్రం, కోరాపూట్ జిల్లా బోస్‌పూట్ గ్రామానికి చెందిన పాటిఖిల్లా తప్పించుకు తిరుగుతున్నాడు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తచ్చాడుతున్న విషయాన్ని తెలుసుకున్న పోలీస్‌లు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కోర్టుకు తరలించారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

రామభద్రపురం: గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో గంజాయి, నల్లమందు విరివిగా ఈ ప్రాంతంలో అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించామని, దీనిని నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనికోసం ఒక ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి ఎక్కడ నుంచి మత్తు పదార్థాలు వస్తున్నాయి, ఎవరెవరు సరఫరా చేస్తున్నారన్న దానిపై ఆధారాలు సేకరిస్తున్నామన్నారు. మండలంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిరోధించడానికి బ్లాక్‌స్పాట్‌లు గుర్తిస్తున్నామని, అక్కడ హెచ్చరిక బోర్డులతోపాటు స్పీడ్‌బ్రేకర్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పెట్రోలు బంకు తనిఖీ

బొబ్బిలి: పట్టణంలో పాతకోర్టు సమీపంలో గల పెట్రోలు బంకును రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రామ్‌కుమార్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. పెట్రోలు, డీజిల్‌లో నాణ్యతా ప్రమాణాలను, కొలతల్లో పారదర్శక తను ఆయన పరిశీలించారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా నాణ్యమైన పెట్రోలు, డీజిల్‌ను స్పష్టమైన కొలతలతో విక్రయించాలని బంకు నిర్వాహకులకు ఆయన సూచించారు.